# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-09-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రైతుల ఆదాయాన్ని పెంచడానికి మంత్రిమండలి సమావేశంలో 7 కీలక నిర్ణయాలు తీసుకున్నామని కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.**
2. **వరద ప్రభావిత ప్రాంతాల్లో అంటురోగాలు వ్యాపించకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.**
3. **తెలంగాణలో వరదల బాధితులకు తక్షణ సహాయం కింద కుటుంబానికి 10 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేయనున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి వెల్లడించారు.**
4. **వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల అవసరాలు తీర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు.**
5. **అల్పపీడన ప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రానున్న ఐదు రోజులపాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.**

=============================

రైతుల ఆదాయాన్ని పెంచడానికి మంత్రిమండలి సమావేశంలో 7 కీలక నిర్ణయాలు తీసుకున్నామని కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. నిన్న ఢిల్లీలో కేంద్ర మంత్రి వర్గ నిర్ణయాలను మంత్రి పాత్రికేయులకు వివరించారు. ఈ సందర్భంగా అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ, రైతులసంక్షేమం కోసం మొత్తం 13 వేల 966 కోట్ల రూపాయలతో చేపట్టే ఏడు పథకాలకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. వ్యవసాయంలో నూతన సాంకేతికత వియోగం కోసం డిజిటల్ పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ తరహాలో డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ( 37 సెకన్లు )

---------------------------

వరద ప్రభావిత ప్రాంతాల్లో అంటురోగాలు వ్యాపించకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. నిన్న రాత్రి విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో ముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, బుడమేరు ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. సహాయక చర్యల కోసం 32 డివిజన్లకు 32 మంది ఐఏఎస్ అధికారులను నియమించామన్నారు. పడవలు, హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా వరద భాదితులకు ఆహారాన్ని అందిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ (28 సెకన్లు)

---------------------------

అంతకుముందు విజయవాడ ప్రకాశం బ్యారేజ్ వద్ద వరద ఉద్ధృతిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిశీలించారు. బ్యారేజ్ గేట్లను పడవలు ఢీకొట్టిన ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. గేట్ల మరమ్మతులకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో మాట్లాడారు. విజయవాడలో వరద బాధితులకు సాయం అందించేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరద బాధితులు సహాయం కోసం 0866–2424172, 0866–2575833, 18004256029 నెంబర్లను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

---------------------------

వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల అవసరాలు తీర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. విజయవాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిన్న మంత్రి మాట్లాడుతూ, వరద ఉద్ధృతి తట్టుకునే లక్ష్యంతో పనిచేస్తున్నామని అన్నారు. ముంపు బాధితులకు ఆహార సరఫరా, సహాయ, పునరావాస కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, నిర్వహణ బృందాలు సమన్వయంతో పని చేస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం మొత్తం సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని మంత్రి వివరించారు.

---------------------------

తెలంగాణలో వరద బాధితులకు తక్షణ సహాయం కింద కుటుంబానికి 10 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి వెల్లడించారు. నిన్న సూర్యాపేట, ఖమ్మం జిల్లాలలో వరద ప్రభావిత ప్రాంతాలను ముఖ్యమంత్రి పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా జిల్లాలో జరిగిన పంట, ఆస్తి నష్టం వివరాలు అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, వరదల కారణంగా నష్టపోయిన ప్రతి కుటుంబాన్నీ ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. బాధితులకు సత్వర సహాయం కోసం జిల్లా కలెక్టర్ల వద్ద 5 కోట్ల రూపాయల అత్యవసర నిధి అందుబాటులో ఉంచామన్నారు. బాధితులకు నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలని, భోజనం అందించాలని వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు.

---------------------------

తెలంగాణలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో భద్రతను పెంచి మహిళా వైద్య సిబ్బందికి రక్షణ కల్పించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలల్లో భద్రతకు సంబంధించి అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన మార్గదర్శకాలపై నిన్న హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రధాన ఆసుపత్రుల్లో షీ టీంలతో రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహించేలా నిబంధనలు రూపొందించాలని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని బోధనాసుపత్రుల్లో శాశ్వత ప్రాతిపదికన పోలీసు అవుట్‌పోస్టులను ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు, వరదల కారణంగా 481 రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. మరో 152 రైళ్లు దారి మళ్లించామని, 13 రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్లు పేర్కొంది. కాజీపేట–డోర్నకల్,

విజయవాడ–డోర్నకల్, విజయవాడ–గుంటూరు, డోర్నకల్–కాజీపేట, సికింద్రాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్, సికింద్రాబాద్–షాలిమర్ రైళ్లను రద్దు చేసినట్లు తెలిపింది. ధ్వంసమైన రైల్వేట్రాక్‌లకు వేగంగా మరమ్మతులు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. దాదాపు 500 మంది రైల్వే సిబ్బంది, కార్మికులు మరమ్మత్తుల పనుల్లో పాల్గొంటున్నారని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ తెలిపారు.

---------------------------

భారీ వర్షాలు, వరదలతో హైదరాబాద్– విజయవాడ రహదారిలో నిలిచిపోయిన వాహనాల రాకపోకలను అధికారులు పునరుద్ధరించారు. దాదాపు 30గంటల తర్వాత జాతీయ రహదారి ఎన్‌హెచ్–65పై వాహనాల రాకపోకలు యథావిధిగా ప్రారంభమయ్యాయి. ఎన్టీఆర్ జిల్లా గరికపాడు వద్ద కొత్త వంతెన మీదుగా రాకపోకలు కొనసాగుతున్నాయి. అలాగే ఐతవరం వద్ద తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి కూడా వాహనాలను అనుమతిస్తున్నారు. జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను పునరుద్ధరించినట్లు కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

---------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వరద పరిస్థితులు కలచివేశాయని పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఫోన్ చేసి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పరిస్థితులను వివరించినట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఇప్పటికే మాట్లాడినట్లు ప్రధానమంత్రి తెలిపారని, సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారని ఈ సందర్భంగా వెంకయ్యానాయుడు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రుల సహాయ నిధికి చెరో 5లక్షల రూపాయల చొప్పున విరాళాన్ని వెంకయ్యానాయుడు ప్రకటించారు.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం తూర్పు విదర్భ , తెలంగాణ పరిసరాల్లో కొనసాగుతోంది. ఇది పశ్చిమ–వాయవ్య దిశగా కదులుతూ తీవ్ర అల్పపీడనంగా బలహీనపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే ఐదు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని.. అక్కడక్కడా కొన్ని జిల్లాల్లో పిడుగులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

తెలంగాణలోనూ రాబోయే ఐదు రోజులు మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జన గామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని ప్రమాద హెచ్చరికలు జారీ చేసింది.భారీ వర్షాల నేపథ్యంలో ఈ రోజు ఖమ్మం జిల్లాలో పాఠశాలలకు జిల్లా కలెక్టర్ సెలవు ప్రకటించారు.

---------------------------

భారీవర్షాల కారణంగా తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల నడిచే బస్సులను రద్దు చేసినట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ – టీజీఎస్ ఆర్టీసీ వెల్లడించింది. ఇప్పటివరకు 1400కు పైగా బస్సులను రద్దు చేసినట్లు తెలిపింది. ముఖ్యంగా ఖమ్మం, విజయవాడ, మహబూబాబాద్ వైపుగా వెళ్లే రహదారులన్నీ జలమయం కావడంతో ఆయా మార్గాల్లో బస్సులను పూర్తిగా రద్దు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

====================